




దోమకొండలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



జిల్లా గ్రంథాలయంలో క్యూలైన్‌లో నిల్చున్న ఉపాధ్యాయులు



కామారెడ్డి బాలుర పాఠశాలలో క్యూలైన్‌లో నిల్చున్న పట్టభద్రులు

ఎమ్మెల్సీ ఎన్నికలు.. ప్రశాంతం!

- పట్టభద్రుల స్థానానికి 78.12 శాతం పోలింగ్ నమోదు
- టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 93.63 శాతం పోలింగ్
- ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు పోలైన ఓట్లు 14,703
- పిట్లంలో ఓటు వేసిన జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు
- కామారెడ్డిలో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- లింగంపేటలో బీజేపీ నేతలపై చేయిచేసుకున్న ఎల్లారెడ్డి డీఎస్పీ

కామారెడ్డి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో మండలి పోరుకు మొత్తం 54పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జిల్లా అధికారులు ముందస్తుగానే పూర్తి ఏర్పాట్లు చేసి పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించారు. పోలింగ్ సందర్భంగా ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో పట్టాభద్రుల స్థానానికి 78.12 శాతం పోలింగ్ నమోదు కాగా టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 93.63 పోలింగ్ శాతం నమోదైంది. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు జిల్లా వ్యాప్తంగా 14,703 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కామారెడ్డిలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఓటు వేయగా, పిట్లంలో స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పట్టభద్రులకు 78.12 శాతం పోలింగ్

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి జిల్లాలో జరిగిన ఎన్నికల్లో 78.12 పోలింగ్ శాతం నమోదైంది. జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మూడు రెవెన్యూ డివిజన్‌ల వారిగా పట్టభద్రుల స్థానానికి పోలింగ్ నిర్వహించారు. ఉదయం నుంచే పట్టభద్రులైన ఓటు హక్కు కలిగి ఉన్న వారు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 10 గంటలకు పట్టభద్రుల పోలింగ్ శాతం 5.05శాతం నమోదు కాగా, మధ్యాహ్నం 12 గంటలకు పోలింగ్ శాతం 24.24, మధ్యాహ్నం 2 గంటలకు పోలింగ్ శాతం 47.43, 4 గంటలకు పోలింగ్ శాతం 56.09 శాతం, 4 గంటల తర్వాత 78.12 శాతం నమోదైంది. ఇందులో కామారెడ్డి డివిజన్ పరిధిలో 76.06 శాతం, ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో 83.28 శాతం, బాన్సువాడ డివిజన్ పరిధిలో 78.30 శాతం ఓటింగ్ నమోదైంది.



పెద్దకొడప్‌గల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి



ఓటు హక్కును వినియోగించుకున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

..జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

..కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

ఉపాధ్యాయ స్థానానికి 93.63 పోలింగ్ శాతం నమోదు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ రెవెన్యూ డివిజన్ల పరిధిలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 93.63 శాతం పోలింగ్ నమోదైంది. పట్టభద్రుల స్థానాని కంటే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి భారీగానే పోలింగ్ శాతం నమోదు కావడం విశేషం. ఉదయం 10 గంటలకు ఉపాధ్యాయుల పోలింగ్ శాతం 7.66 నమోదు కాగా మధ్యాహ్నం 12 గంటలకు పోలింగ్ శాతం 38.38, మధ్యాహ్నం 2 గంటలకు పోలింగ్ శాతం 64.74, 4 గంటలకు పోలింగ్ శాతం 67.33, 4 గంటల తర్వాత 93.63 శాతం నమోదైంది. కామారెడ్డి డివిజన్ పరిధిలో 93.03 శాతం, ఎల్లారెడ్డి 92.64 శాతం, బాన్సువాడ 94.78 శాతం ఓట్లు పోలాయ్యాయి.

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు పోలైన ఓట్లు 14,703

జిల్లాలోని పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు మొత్తం 54 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్‌లలో ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు మొత్తం 14,703 ఓట్లు పోల్ అయ్యాయి. పట్టభద్రుల స్థానానికి జిల్లా వ్యాప్తంగా 16,410 ఓట్లు ఉండగా ఇందులో పురుషుల ఓట్లు 11,616, మహిళల ఓట్లు 4,793, ఇతరుల ఓట్లు 1 ఉన్నాయి. ఇందులోంచి మొత్తం 12,820 ఓట్లు పోల్ అయ్యాయి. పురుషుల ఓట్లు 9,127, మహిళల ఓట్లు 3,693 ఓట్లు పోల్ అయ్యాయి. అదే విధంగా ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి జిల్లా వ్యాప్తంగా 2,011 ఓట్లు ఉండగా ఇందులో పురుషుల ఓట్లు 1,307, మహిళల ఓట్లు 704 ఉన్నాయి. ఇందులోంచి మొత్తం 1,883 ఓట్లు పోల్ అయ్యాయి. పురుషుల ఓట్లు 1,216, మహిళల ఓట్లు 667 ఓట్లు పోల్ అయ్యాయి. కామారెడ్డి డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు 9,350 మంది ఉండగా 7,160 మంది ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో పురుషుల ఓట్లు 4,826, మహిళల ఓట్లు 2,334 ఉన్నాయి. టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు 1,331 ఉండగా 1,242 మంది ఓటు హక్కును వినియోగించుకోగా అందులో 763 మంది పురుషులు, 479 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 2,655 మంది ఉండగా 2,211 మంది ఓట్లు వినియోగించుకోగా పురుషులు 1,699 మంది, మహిళలు 512 మంది, టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు 163 ఉండగా 151 మంది ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో 99 మంది పురుషులు, 52 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాన్సువాడ డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 4,405 మంది ఉండగా ఇందులో 3,449 మంది ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో పురుషులు 2,602, మహిళలు 847 ఓట్లు హక్కును వినియోగించుకున్నారు. టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు 517 ఉండగా 490 మంది ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో 354 మంది పురుషులు, 136 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా సాగిన పోలింగ్

జిల్లాలో జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రశాంతంగా సాగాయి. జిల్లాలోని 54 పోలింగ్ కేంద్రాలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖులు సైతం తమ ఓటు హక్కును వారివారి పోలింగ్ కేంద్రాల్లో వినియోగించుకున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పిట్లంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కామారెడ్డిలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్‌లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డిలు, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇలియాస్, కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియలు ప్రభుత్వ బాలుర పాఠశాలలో వినియోగించుకోగా ఇతరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని పరిశీలించారు. ఎస్పీ సింధూశర్మ బందోబస్తును పర్యవేక్షించారు. అదే విధంగా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ కామారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్కుల వద్ద పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. లింగంపేట మండల కేంద్రంలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ నేతలపై ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి చేయి చేసుకోవడంతో కొద్దిసేపు ఆందోళన చోటు చేసుకుంది.



కామారెడ్డిలోని పోలింగ్ కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు



ఓటు హక్కును వినియోగించుకున్న కామారెడ్డి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఇందుప్రియ దంపతులు

..కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్ఞానేశ్వరి

..టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉద్యోగులు

ప్రాణహిత - చేవెళ్ల పూర్తి చేసి కామారెడ్డిని సస్యశ్యామలం చేస్తా

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

భిక్కనూరు, ఫిబ్రవరి 26(ఫిబ్రవరి): ప్రాణహిత - చేవెళ్ల పథకాన్ని పూర్తిచేసి కామారెడ్డిని సస్యశ్యామలం చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం భిక్కనూరులో ఆయన మాట్లాడుతూ ప్రాణహిత - చేవెళ్ల పథకం నా కళ అని, ఈ పథకం పూర్తయితే కామారెడ్డి ప్రజలకు ముఖ్యంగా రైతులకు నీటి సమస్య ఉండబోదన్నారు. ఎండ తీవ్రతతో భూగర్భజలాలు తగ్గుముఖం పడుతు న్నాయని వెంటనే ఈ పథకం పూర్తి చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతులు, నాయకులు కోరగా వెంటనే మంత్రి ఉత్తమ్‌కుమార్‌కు ఆయన ఫోన్ చేసి పరిస్థితిని వివరించగా రెండు రోజుల్లో అధికారులతో ప్రత్యేక సమావే శాన్ని ఏర్పాటు చేయిస్తానని, వీలైనంత త్వరగా ఈ పథకంలో భాగంగా పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కాగా అంతకుముందు భిక్కనూరులో ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని ఆయన పరిశీలించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వామి, ఎన్‌ఆర్‌ఐ సెల్ జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, తాటిపాముల లింబాద్రి, భూమయ్య, సుదర్శన్, జీవన్, మహిపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

మైలారంలో రసవత్తరంగా కుస్తీ పోటీలు

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామంలో గురువారం మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని రాజరాజేశ్వర ఆలయం వద్ద గ్రామస్థులు కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం లాగే ఈ సం వత్సరం కూడా కుస్తీ పోటీలను నిర్వహి ంచామన్నారు. ఈ కుస్తీ పోటీలకు మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాల నుంచి మల్లయోధులు విచ్చేసి కుస్తీ పోటీల్లో తలపడ్డారు. ఈ కార్యక్ర మంలో గ్రామస్థులు ఆలయ కమిటీ సభ్యులు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

కలెక్టర్ స్పందించకపోవడం బాధాకరం

- తెలంగాణ లెక్చరర్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు బాలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): టీచర్ ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రక్రియలో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులు, టీచర్‌ల ఓట్లను తొలగించారని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌కు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం బాధాకరమని తెలంగాణ లెక్చరర్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు బాలు ఒక ప్రకటనలో ఆరోపించారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం తప్పుడు ఫిర్యాదు చేస్తే స్పందించిన అధికారులు తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని కోరితే మాత్రం స్పందించలేదని అన్నారు. ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన విద్యావంతులకు ఓటువేసే అవకాశం లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. తహసీల్దార్‌లు ఏ ప్రాతిపాదికన ఓటర్లను తొలగించారని అడిగితే కూడా చెప్పే పరిస్థితి లేదన్నారు. ధ్రువీకరణ పత్రాలు అందించిన తర్వాతే ఆరా తీస్తే ఓట్లు డిలీట్ అయ్యాయని అధికారులు వివరించారు. దీనికి కారకులైన వారిని చట్టపరంగా శిక్షించాలని కోరుతున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి
కార్ అండ్ బైక్ రేస్



ఫిబ్రవరి నెల కూపన్ నంబర్ - 3

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది ఫిబ్రవరి నెల మూడవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి 2025 మార్చి నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.

నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.
* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.



కూపన్లు పంపవలసిన చిరునామా
ఆంధ్రజ్యోతి కార్యాలయం, గొల్లపల్లిరోడ్, గ్రా: ధర్మారం (బి),
మం: డిచ్‌పల్లి, జిల్లా : నిజామాబాద్ - 503 230
అసిస్టెంట్ మేనేజర్ (సర్క్యులేషన్) : 99854 11454
బ్రాంచ్ మేనేజర్ : 99854 11451


బోధన్‌లో బారులు తీరిన పట్టభద్రుల ఓటర్లు


నగరంలో ఓటు వేస్తున్న పట్టభద్రుడు


వేల్పూర్‌లో..


ఏర్గట్లలో..


ఓట్ల పోలింగ్ సరళి పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేందర్ కుమార్

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు, టీచర్స్ ఉపాధ్యాయ ఎన్నికలు గురువారం బోధన్ డివిజన్‌లో ప్రశాంతంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సాలూర మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని, బోధన్ పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఎలాంటి తప్పులు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. బోధన్ తహసీల్దార్ విఠల్ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తయ్యేలా ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయి చర్యలు చేపట్టారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎన్నికల సమయం ముగించాల్సి ఉండగా 4గంటల తర్వాత కూడా పట్టభద్రుల ఓటర్లు కళాశాల ప్రాంగణం లోపల ఉండడంతో మరో గంటపాటు పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకునే అవకాశాన్ని అధికారులు కల్పించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలో సీఐ వెంకట నారాయణ, సాలూరలో రూరల్ సీఐ విజయ్ బాబులు బందోబస్తును పర్యవేక్షించారు. ఉదయం నుండి స్వల్పంగా వచ్చిన ఓటర్లు మధ్యాహ్నం తర్వాత పోలింగ్ అధిక శాతం నమోదు కావడం జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు విరమించిన పట్టభద్రుల ఓటర్లు మధ్యాహ్నం అనంతరం బోధన్ పట్టణంలోని జూనియర్ కళాశాల, డివిజన్‌లోని వివిధ మండలాల పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దంపతులు చంటి పాపతో వచ్చి మండుటెండలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలలో బోధన్ డివిజన్‌లో 5037 ఓట్లు ఉండగా వీరిలో 4106మంది ఓటుహక్కును వినియోగించుకున్నారని, టీచర్స్ ఉపాధ్యాయ ఎన్నికలలో 701ఓట్లు ఉండగా 660మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని సబ్ కలెక్టర్ వెల్లడించారు. బోధన్ డివిజన్‌లో ఎమ్మెల్సీ టీచర్స్ ఉపాధ్యాయుల ఎన్నికల్లో 94.15, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 81.51శాతం నమోదయ్యాయని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో వెల్లడించారు. టీచర్స్ ఎన్నికలలో పీఆర్‌టీయూ సంఘం నాయకులు తమ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

డిచ్‌పల్లి: మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్- కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి మండలంలో ఉదయం 8గంటల కు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4గంటల వరకు కొనసాగింది. ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా డిచ్‌పల్లి ఎస్సై షరీఫ్ .సీఐ మల్లేశ్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రత ఏర్పాట్లు కల్పించారు. ఉదయం మంద కొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 1గంట తర్వాత పుంజుకుంది. మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఎమ్మెల్సీ పట్ట భద్రుల ఓట్లు 821 ఓట్లు నమోదు చేసుకోగా 683 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకు న్నారని తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు. ఇందులో పురుషులు 417ఓటర్లు, స్త్రీలు 266మంది ఓట్లు వేశారని తెలిపారు. ఉపాధ్యాయ ఎన్నికల్లో 41ఓట్లు నమోదు చేసుకోగా 40మంది ఓటు వేశారని తహసీల్దార్ పేర్కొన్నారు. 4.05గంటలకు ఆలస్యంగా ఓటు వేయడానికి వచ్చిన మెంట్రాజ్‌పల్లి గ్రాడ్యుయేట్ నర్సారెడ్డిని పోలీసులు , సిబ్బంది వెనిక్కి పంపించారు.య ఓటింగ్ సరళిని ఆర్డీవో కుమార్ కేంద్రాన్ని సందర్శించి తహసీల్దార్ ప్రభాకర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించి సీఐ, మల్లేశ్, ఎస్సై షరీఫ్ లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి 200అడుగుల దూరంలో పలు పార్టీల కు చెందిన నాయకులను, కార్యకర్తలను ఉంచేందుకు ఏర్పాట్లు చేయడంతో భాజపా, కాంగ్రెస్ నాయకులు, ఓటర్లకు తమ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు. మెడలో వేసుకున్న పలు పార్టీల కండువలను, టోపీలను పోలీసులు తొలగింపజేశారు. పోలింగ్ సరళిని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఏఎంసీ ఛైర్మన్‌నాగేశ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలసాని శ్రీనివాస్ లను అడిగి తెలుసుకున్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీశ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రకాంత్ లు ఓటర్ లను తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎన్నిక ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఏర్గట్ల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మండల కేంద్రంల ప్రశాంతంగా ముగిసాయి. జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 154, 100 పోలింగ్ బూత్‌లో మొత్తం 321 ఓటర్లు ఉండగా అందులో ముగ్గురు పోస్టల్ బ్యాలెట్ వేయగా 301 మంది పట్టభద్రులకు 249, 17 మంది టీచర్లకు గాను 15 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పీవో ప్రమోద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎస్సై రాము, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్పల్లి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా గురువారం ముగిసాయి. మండలంలోని 468 పట్టభద్రుల ఓట్లు ఉండగా 407 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా మండలంలోని 31 మంది ఉపాధ్యాయు ఓటర్లకు గాను 26 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తహశీల్దార్ మాలతి ఎన్నికలను పర్యవేక్షించారు. నిజామాబాద్ ఆర్డీవో పోలింగ్ సరళిని పరిశీలించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు వేరువేరుగా కాంపెయిన్‌ను నిర్వహించారు. మొత్తంమీద ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండల కేంద్రంలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహించారు. ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఖిల్లా: గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు పోలీసు బందోబస్త్ మధ్య గురువారం ప్రశాంతంగా జరిగాయి. అదనపు డీసీపీ బస్వారెడ్డి పర్యవేక్షణలో, నిజామాబాద్ ఏసిపి,ఎల్.రాజవెంకటరెడ్డి, ఆర్మూర్, బోధన్ ఏసిపిల నేతృత్వంలో భారి బందోబస్త్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో నిర్మల హృదయ కళాశాల, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సీఎస్ఐ కళాశాలతో పాటు బోధన్, ఆర్మూర్ డివిజన్లలో మొత్తం ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద భారీగా పోలీసులను నియమించారు. పోలింగ్ కేంద్రం చుట్టు వందమీటర్ల దూరంలో అన్ని వ్యాపార సముదాయాలను మూసివేయించారు.పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్‌ను అమలు చేశారు.

ముప్కాల్: ముప్కాల్ మండల కేంద్రంలో నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లా పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పట్టాభద్రులు ఓట్లు 513 కాగా 426 పోలయ్యాయి. ఉపాధ్యాయ ఓట్లు 52కాగా 50 పోలయ్యాయని అధికారులు తెలిపారు. బాల్కొండ కేంద్రంలో పట్టభద్రులు, ఉపాధ్యాయల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగగా పట్టభద్రులు 633ఓట్ల గాను 488 పొలయ్యాయి. ఇందులో ఉపాధ్యాయ ఓట్ల 28కాగా 28పొలయ్యాయని అధికారులు తెలిపారు.

ఎడపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ఎడపల్లి మండలంలో ప్రశాంతంగా జరిగాయి. మండలంలో పట్టభద్రుల ఓట్లు 573ఉండగా 501 ఓట్లు పోలయ్యాయి. 87.43శాతం పట్టభద్రుల పోలింగ్ శాతం నమోదు అవ్వగా ఉపాధ్యాయుల ఓట్లు మొత్తం 50 ఉండగా 44 పోలవ్వడంతో 88 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలోభారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాన్ని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. మండలంలో 88 శాతం పోలింగ్ నమోదు అయినట్లు మండల ఎన్నికల అధికారి, తహసీల్దార్ ధన్వాల్ తెలిపారు. మొదటి సారి పట్టభద్రుల ఓటుహక్కును వినియోగించుకునేందుకు మండలంలోని యువతీ, యువకులు బారులు తీరారు.పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేకబందోబస్తును ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఎన్నికల సరళిని పరిశీలించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టారు.

వేల్పూర్: మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రులు 953 ఓటర్లు ఉండగా 739ఓటర్లు (77శాతం) ఓట్లు వేశారు. టీచర్స్ ఎమ్మెల్సీ 62మంది ఉండగా 61మంది ఓటు హక్కు (98శాతం) వినియోగించుకున్నట్లు తహసీల్దార్ సంతోష్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏలాంటి సంఘటనలు జరుగకుండా ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా సొంత గ్రామమైన వేల్పూర్‌లో డీసీసీబీ ఛైర్మన్ కుంట రమేష్‌రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఆర్మూర్ మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సోదరుడు వేల్పూర్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీబీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 14నెలల లోపల 50వేల ఉద్యోగాలుభర్తీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభు త్వానికి కృతజ్ఞతలుగా పట్టభద్రులు తమ నిరుద్యోగులు అందరు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి అల్‌ఫోర్స్ నరేందర్‌రెడ్డి గెలుపు కొరకు ఓటును వేయాలని పట్టభద్రుల టీచర్‌లను కోరారు. పట్టభద్రుల కమిటీమెంట్ ఉత్సహం చూస్తే నరేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని ఆశభావం వ్యక్తం చేశారు.

డొంకేశ్వర్: మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు 81శాతం ఓట్లు పొలయ్యాయి.పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా, శాంతి భద్రలపై సిబ్బందిక సూచనలిస్తూ ఎస్సై చిరంజీవి పర్యవేక్షించారు. తహసీల్దార్ పోలింగ్ సరళిని పరిశీలించారు.

నవీపేట: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మండలంలో 810మంది ఓటర్లు ఉండగా 635మంది పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 78.39శాతం పట్టభద్రుల ఓటింగ్ జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 92శాతం పోలింగ్ జరిగిందని అధికారులు పేర్కొన్నారు.

మోర్తాడ్: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో గురువారం పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకు న్నారు. పట్టబద్రుల ఓట్లు 671ఉండగా 549ఓట్లు పొలయ్యాయి. స్థానిక జూనియర్ కళాశాలలో జరిగిన పోలింగ్ స్టేషన్‌ను భీమ్‌గల్ సీఐ సత్యనారాయణగౌడ్ పర్యవేక్షించారు. మోర్తాడ్ పోలీసులు పోలింగ్ స్టేషన్ వద్ద బందోబస్తు నిర్వహించారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రుల పోలింగ్ 76.8శాతం కాగా ఉపాధ్యాయుల పోలింగ్ 96శాతం నమోదైంది. 1173పట్టభద్రులు ఓటర్లు ఉండగా 902ఓటు హక్కు వినియోగించుకున్నారని, వీరిలో 574మంది పురుషులు, 328మంది మహిళలు ఉన్నారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ మహమ్మద్‌షబ్బీర్ పర్యవేక్షించారు. పోలింగ కేంద్రాల వద్ద ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మోస్రా: మండలంలో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం పట్టభద్రులు ఓట్లు 84శాతం, ఉపాధ్యాయుల ఓట్లు వందశాతం నమోదు అయ్యాయి. చందూర్ మండలంలో మొత్తం ఉపాధ్యాయులు 17ఓట్లు ఉండగా 17ఓట్లు పోలయ్యాయి.

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో మొత్తం గ్రాడ్యుయేట్‌లు 339మంది ఉండగా, 282 ఓట్లు పోల్ అయ్యాయి. టీచర్లలో 99 శాతం, గ్రాడ్యుయేట్‌లో 82 శాతం ఓట్లు పోల్ అయినట్లు తహసీల్దార్ వెంకట్రామ్ తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో రాజేందర్ తనిఖీ చేశారు.

రెంజల్: పట్టభద్రుల ఎమ్మెల్సీతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం రెంజల్ మండలంలో ప్రశాంతంగా జరిగాయి. మండలంలో పట్టభద్రుల ఓట్లు 435ఉండగా 10పోస్టల్ బ్యాలెట్లు, 379ఓట్లు పోలయ్యాయి. 89.17శాతం పట్టభద్రుల పోలింగ్ శాతం నమోదు అవ్వగా ఉపాధ్యాయుల ఓట్లు మొత్తం 13ఉండగా 13పోలవ్వడంతో వందశాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రెంజల్ ఎస్ఐ సాయన్న ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. ఓటుహక్కును వినియోగించుకునేందుకు వచ్చిన సిబ్బందికి పోలీసులు సహకరించి కీలకపాత్ర పోషించారు. దీంతో మండలంలో 89.17శాతం పోలింగ్ నమోదు అయినట్లు మండల ఎన్నికల అధికారి, తహసీల్దార్ శ్రావణ్ కుమార్ తెలిపారు. మొదటి సారి పట్టభద్రుల ఓటుహక్కును వినియోగించుకునేందుకు మండలంలోని యువత బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఎన్నికల సరళిని పరిశీలించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టారు.

మోపాల్: ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎన్నికల్లో భాగంగా గురువారం మోపాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ ఓటర్లు బారులు తీరారు.కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టిబందో బస్తు ఏర్పాట్లు చేశారు. పోలీసుఅధికారులు,రెవెన్యూ అధికారులు పోలింగ్‌కేంద్రాన్ని పర్యవేక్షిం చారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలో గురువారం పట్టాభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా పరిషత్ పాఠశాలలో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. పట్టాభద్రుల విభాగంలో 244 మందికి గాను 151 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టాభద్రుల విభాగంలో 60.64 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయుల్లో 33 మందికి గాను 26 మంది ఓటు హక్కును వినియోగించుకోగా పోలింగ్ 79 శాతం నమోదైంది. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్నిరకాల వసతులు కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పొతంగల్ మండల కేంద్రంలో 259 మంది పట్టాభద్రులకు గాను 211 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను కోటగిరిలో తహసీల్దార్ గంగాధర్, రుద్రూర్‌లో తహసీల్దార్ తారాబాయిలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. రుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్సైలు సందీప్, సాయన్నలు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

కమ్మర్‌పల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు బుధవారం కమ్మర్‌పల్లిలో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నా ఉపందుకుంది. ఎన్నికల సమయం 4 గంటలవరకు ఉండగా సాయంత్రం 5 గంటలవరకు పోలింగ్ జరిగింది. 61 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 56 మంది, 1021 మంది పట్టద్రుల ఓటర్లకు గాను 771 మంది తమ ఓటు హక్కులను వినియోగించుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎలాటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా కమ్మర్‌పల్లి తహసీల్దార్ అంజనేయులు, ఎస్ఐ అనీల్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

సిరికొండ: పట్టభద్రుల నియోజక వర్గానికి జరిగిన ఎన్నికల్లో సిరికొండ మండలానికిచెందిన 556 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగి ంచుకున్నారు.మండలంలో 715 మంది ఓటర్లు ఉండగా గురువారం జరిగిన ఎన్నికల్లో 556 మంది ఓట్లు వేశారు. 159 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా ఇతర ప్రాంతాల్లో ఉన్న 159 మందిఓటర్లు తమ ఓటును వినియోగించుకోలేక పోయారు. మొత్తం మీద 77.76 శాతం మంది ఓట్లు వేశారని తహసీల్దార్ తెలిపారు.

ఆర్మూర్‌రూరల్: ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఆర్మూర్ డివిజన్‌లో 16కేంద్రాలలో పట్టభద్రుల ఎన్నికలు 13కేంద్రాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహించారు. ఆర్మూర్ మండలం, పట్టణానికి సంబంధించిన ఓటర్లు పెర్కిట్‌లోని పోలింగ్ కేంద్రాలలో ఓట్లు వేశారు. ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ సరళిని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దామోదర్‌రెడ్డిలు పరిశీలించారు. మండలంలో పటభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 70.52శాతం పోలింగ్ జరిగింది. మొత్తం ఓట్లు 37.08కాగా2616ఓట్లు పొలయ్యాయి.పోలింగ్ ప్రక్రియప్రశాంతంగా సాగింది.


మోర్తాడ్..


ధర్పల్లిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు


భీమ్‌గల్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై మహేష్


రెంజల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్

ఫ్లెక్సీల వివాదం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన ఈఆర్ ఫౌండేషన్ ఫెక్సీల చింపివేతపై ఫౌండేషన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవన్‌లో ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ఈఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు చేస్తున్న సహాయ సహకారాలకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కొందరు వ్యక్తులు సిద్దులగు ట్టపైకి వెళ్లే దారిలో ఈఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఫెక్సీలను గంటలోపే చించివేశారని ఇదీ సరైన పద్ధతి కాదన్నారు. ఫ్లెక్సీలను తొలగించామని కొందరు ఫోన్‌లు చేశారని, ఇకనైనా తమ తప్పులను గుర్తెరిగి అందరిని గౌరవించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, బదం రాజ్‌కుమార్, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట,ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండలం బాగేపల్లి 132కేవీ సబ్ స్టేషన్ మరమ్మత్తుల్లో భాగంగా శుక్రవారం మండలంలోని నవీపేట, రాంపూర్, కమలాపూర్‌లోని 33/11సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఉదయం 10గంటల నుండి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన వివరించారు.

● కోస్లీ, యంచ సబ్‌స్టేషన్‌ల పరిధిలో..

మండలంలోని కోస్లీ, యంచ 33/11సబ్ స్టేషన్‌ల పరిధిలో శుక్రవారం ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఆయా సబ్ స్టేషన్‌ల పరిధిలో జరిగే విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మాదాపూర్ పోలింగ్ కేంద్రం పరిశీలన


మాదాపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

మాక్లూర్, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని మాదాపూర్ గ్రామంలో జరిగిన ఎమ్మెల్సీ పోలింగ్ కే ంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పట్టభ ద్రులు 789 గాను 629పట్ట భద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 382 కాగా మహిళలు 247ఉన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీకి 79కి గాను 76 ఓట్లు పొలయ్యాయి.

పోలింగ్ కేంద్రాల వద్ద సందడి


నగరంలో బారులు తీరిన ఓటర్లు



నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్ సందర్భంగా నిజామాబాద్ నగరంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే సందడి వాతావరణం కనిపించింది. నగరంలోని నిర్మల హృదయ, ఎస్ఎఫ్ఎస్, పాలిటెక్నిక్, సీఎస్ఐ పాఠశాలల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా పోలింగ్ కేంద్రాల వద్ద కాంగ్రెస్, బీజేపీ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన టెంట్ల వద్ద కూర్చొని ఓటర్లకు సహాయం చేస్తూ తమకు ఓటు వేయాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఒకవైపు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మరోవైపు కూర్చొని ఓటర్లను తమకు ఓటు వేయాలని కోరారు. నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ వద్ద నుడా ఛైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు కాంగ్రెస్ నాయకులతో ఓటింగ్ సరళిపై చర్చించారు.


నగరంలో ఓటు వేస్తున్న మహిళ

ఎమ్మెల్సీ ఓటు హక్కు

వినియోగించుకున్న సునీల్‌కుమార్

మెండోర, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కును బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ వినియోగించుకు న్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠ శాలలో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధ్యత గల పౌరులుగా ఓటుతో మంచి సమాజానికి బాటలు వేద్దామని అన్నారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, యూత్ అధ్యక్షుడు సలీం, టౌన్ అధ్యక్షుడు రవి, మోహన్, దేవరాజ్, అశోక్, పాల్గొన్నారు.

జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ ప్రత్యేక పూజలు

నవీపేట,ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్ చారిత్రక రాజరాజేశ్వర ఆలయంలో గురువారం జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహ శివరాత్రి ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన గురువారం ఆయన ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువా, పూలమాలలు, మెమోంటోతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీ.మోహన్ రెడ్డి, సరిన్, హన్మాండ్లు, లక్ష్మణ్ తదితరులున్నారు.

ఘనంగా బాలరాజరాజేశ్వర స్వామివారి పల్లకీ ఊరేగింపు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో కొలువుదీరిన శ్రీబాల రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రివరకు ఆలయంలో రుద్రయాంగ అత్యంత భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. మధ్యరాత్రి స్థానిక చావిడి వద్ద స్వామి వారి పల్లకీకి నిషిపూజా, బలిహరణ అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో గ్రామ ప్రధాన వీధులగుండా స్వామి వారి పల్లకీని ఓంనమశివాయ, హరహర మహాదేవ్, శివనామస్మరణతో గ్రామ ప్రధాన వీధులు మారుమ్రోగగా, ఆలయ అర్చకుల వేద మంత్రోత్చరణ మధ్య స్వామివారి పల్లకీని ఊరేగించారు. గురువారం తెల్లవారు జామున 3గంటలకు స్వామివారి పల్లకీ ఆలయానికి చేరుకుంది. అనంతరం ఆలయంలో నిర్వహించిన మహన్యాస పూర్వక, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, పూజా కార్యాక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్న పల్లకీని మొక్కులు మొక్కున్న గ్రామంలోని భక్తుల ఇళ్లకు తిప్పారు. స్థానికులు స్వామివారి పల్లకీని తమ ఇళ్ల వద్ద నిలుపుకోగా ఆలయ ప్రధాన అర్చకులు హైగ్రీయవచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి కట్నకానుకలు సమర్పించుకున్నారు.తెల్లవారు 5గంటలకు స్వామివారి పల్లకీ ఆలయానికి చేరుకుంది. పల్లకీ ఊరేగింపులో ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు, వివి పార్టీల నాయకులు గ్రామస్థులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

భిక్కనూరులో పోలీసులతో బీజేపీ నాయకుల వాగ్వాదం

• కాంగ్రెస్‌పార్టీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపణ • పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చిన ఏఎస్పీ


భిక్కనూరులో పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల అధికారులు


ఇరు పార్టీల నాయకులను చెదరగొడుతున్న పోలీసులు

భిక్కనూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా భిక్కనూరు మండల కేంద్రంలోని పోలింగ్ సమీపంలో గురువారం ఉదయం స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే భిక్కనూరులో కాంగ్రెస్, బీజేపీ నాయకులు వేర్వేరుగా ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేకంగా టెంట్లు వేసుకుని ఓటర్లకు తమ పార్టీకి ఓటేయ్యాలని సూచిస్తూ అక్కడ కూర్చున్నారు. ఈ సమయంలో భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు బీజేపీ నాయకులను టెంట్ ఖాళీ చేసి వెళ్లాలని ఇంతమంది ఒకేదగ్గర గుమిగూడవద్దని బీజేపీ నాయకులను సూచించారు. దీంతో బీజేపీ నాయకులు తమను మాత్రమే పదేపదే టెంటు ఖాళీచేయాలని సూచించడం ఏమిటని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు కేవలం అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఏఎస్పీ చైతన్యరెడ్డి, భిక్కనూరు సీఐ సంపత్ అక్కడికి చేరుకుని ఇరు పార్టీల నాయకులను సముదాయించి ఇదరు పార్టీలకు చెందిన నాయకులను టెంట్ల నుంచి పంపించి వేశారు. కాగా పోలింగ్ కేంద్రాన్ని ఏఎస్పీ, మండల తహసీల్దార్, ఎంపీడీవో పరిశీలించారు. పోలింగ్‌కేంద్రం వద్ద ఓటర్లకు సరైనా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎల్లారెడ్డిలో బారులు తీరిన ఓటర్లు

● పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్, టీచర్ ఎన్నికలు ఎల్లారెడ్డి మున్సి పాలిటీలో ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడానికి భారీ స్పందనతో బారులు తీరారు. పోలింగ్ కేంద్రాన్ని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలింగ్ అధికారులకు సూచించారు. ఓటింగ్ సమయం నాలుగు గంటల వరకు ఓటర్లు బారులు తీయడంతో గేటు లోపల ఉన్న ఓటర్లకు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం అధికారులు కల్పించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ మొత్తం ఓటర్లు 827 ఓటర్లకు గాను 701 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 505, స్త్రీలు 196, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 81 ఓటర్లకు గాను 76 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఎల్లారెడ్డిలో పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు

ముగిసిన 'ఎమ్మెల్సీ' పోలింగ్

ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు, ఉపాధ్యాయ ఎన్నికలు గురువారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కామారెడ్డి జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రా ల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఫొటో న్యూస్


ఎమ్మెల్సీ ఎన్నికలకు బారులు తీరిన ఓటర్లు


ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న అధికారులు


బీబీపేటలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు


నాగిరెడ్డిపేటలో పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ

ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్


దోమకొండలో పోలింగ్ స్టేషన్ పరిశీలిస్తున్న కలెక్టర్


ఓటు హక్కు వినియోగించుకున్నట్లు చూపుతున్న పట్టభద్రులు

దోమకొండ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల, ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం పరిశీలించారు. ఓటింగ్ సరళి, ఏర్పాట్లపై ప్రిసిడింగ్, సెక్టోరల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దోమకొండలో ఏఎస్పీ చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో సీఐ సంపత్ కుమార్, ఎస్సై స్రవంతి, సిబ్బందితో పలువురిని కేంద్రం వద్ద నుంచి 200 మీటర్ల దూరం వరకు పంపించేశారు. దోమకొండ పోలింగ్ కేంద్రంలో పట్టభద్రులు 498, టీచర్లు 57 మొత్తం 555 ఓటర్లు ఉన్నారు. ఇందులో 415 పట్టభద్రులు 83.3 శాతం,55 టీచర్లు 96.5 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. తహసీల్దార్ సంజయ్‌రావు, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

మానాల శంభులింగేశ్వర ఆలయంలో

కమనీయంగా శివపార్వతుల కల్యాణం


మానాల శంభులింగేశ్వరాలయంలో శివ పార్వతుల కల్యాణంలో పాల్గొన్న గ్రామస్థులు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 27: (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలంలోని మారుమూల గ్రామం మానాలలో కొలువుదీరి ఉన్నశ్రీ శంభులింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదిన ఉత్సవాల్లో భాగంగా గురువారం శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మధు పూర్ణ చందర్ శర్మ అధ్వర్యంలో వేద మంత్రోత్చరణల మధ్య శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించగా ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షులు పిసరి భూమయ్య, కార్యదర్శి అంగరేకుల మహేష్ స్వామివారి కల్యాణోత్సవ సందర్భంగా పట్టువస్త్రాలను సమర్పించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరంనిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు గిరిజనులు హాజరయ్యారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు రకాల దుకాణల్లో కొనుగోలుదారులతో కిటకిటలాడాయి ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు మహిళా సంఘాల సభ్యులు, గ్రామ యువజన సంఘాల సభ్యులు, స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజ, అన్నదానంలో పాల్గొన్నారు. కాగా శుక్రవారం బద్ది పోచమ్మ జాతర జరుగుతుందని తెలిపారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

● కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి


బందోబస్తులో పాల్గొన్న ఏఎస్పీ చైతన్యరెడ్డి


బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రామారెడ్డి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శాంతియుతంగా దేవుళ్ల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి పేర్కొన్నారు. రామారెడ్డి మండలం మద్దికుంట అడవి ప్రాంతంలో వెలసిన స్వయంభూ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఉత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఎలాంటి అవస్థలు, గొడవలు లేకుండా భక్తిశ్రద్ధలతో శాంతివతంగా దేవుళ్ల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పలు సలహాలు, సూచనలు, పద్ధతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ రమణ, ఎస్సై నరేష్, ఏఎస్ఐ రవీందర్, లచ్చిరాం, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


శివాలయ రథోత్సవ శోభాయాత్ర

ఘనంగా శివాలయ రథోత్సవం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బోధన్‌లో గురువారం శివాలయ రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. మహ శివరాత్రి పర్వదినం స ందర్భంగా ప్రతియేటా ఉత్సవ మూర్తులతో రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గురువారం బోధన్ ఏసీపీ శ్రీనివాస్, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, దేవాదాయ శాఖ ఈవో రాములు ఆధ్వర్యంలో రథోత్సవానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. రథోత్సవంలో మహిళల కోలాటం అందరిని ఆకట్టుకుంది. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా రథోత్సవ శోభాయాత్ర ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆలయంలో ఉత్సవ మూర్తులను అంగరంగ వైభవంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, ఆలయ కమిటీ నిర్వాహకులు, వేద పండితులు గణేష్ మహరాజ్, మారుతీ మందిర్ చైర్మన్ గుండెటి శంకర్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాధర్ రావు పట్వారీ, మాజీ చైర్మన్ బీర్కూర్ బుజ్జి, దేవాదాయ శాఖ ఈవో రాములు, వివిధ శాఖల అధికారులు, భక్తులు పాల్గొన్నారు.


శోభాయాత్రలో కోలాటమాడుతున్న మహిళలు

రహదారిపై నీళ్లు పట్టించండి సారూ!

జర దేఖో!!



బీర్కూర్‌లో ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

బీర్కూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో నాలుగు పలకల రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే రహదారిపై దుమ్ము లేవకుండా సదరు కాంట్రాక్టర్ ప్రతీరోజు ట్యాంకర్ ద్వారా నీళ్ళు పట్టిస్తున్నాడు. ఇదిలా ఉండగా గత రెండు రోజులుగా రహదారిపై నీళ్ళు పట్టించడం లే దని, దీంతో రహదారిపై విపరీతంగా దుమ్ము లేస్తుంది స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మహా శివరాత్రి పండుగ నేపథ్యంలో గత రెండు రోజులుగా కూలీలు లేక నీళ్ళు పట్టించడం లేదని సదరు కాంట్రాక్టర్ తెలిపాడు. శుక్రవారం నుంచి నీళ్ళు పట్టిస్తానని చెప్పారు. నీళ్ళు పట్టించకపోవడం వల్ల రహదారిపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో విపరీతంగా దుమ్ము లేస్తుందని, తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక దుకాణదారులు తెలిపారు. సదరు కాంట్రాక్టర్ దుమ్ము లేవకుండా నీళ్ళు పట్టించాలని కోరారు. రెండు రోజులుగా నీళ్ల పట్టించకపోవడంపై స్థానికులు రహదారిపై నిలబడి తమ నిరసనను వ్యక్తం చేశారు.

జానకంపేటలో క్రికెట్ పోటీలు


గెలుపొందిన జట్టుకు బహుమతిని అందిస్తున్న దృశ్యం

ఎడపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పండుగను పురస్కరించుకుని ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలో గురువారం నైట్ క్రికెట్ టోర్నమెంటును గ్రామ యువకులు నిర్వహించారు. ఈ టోర్నమెంటులో వివిధ గ్రామాలకు చెందిన 16 జట్లు పోటీల్లో తలపడ్డాయి. ఈ పోటీల్లో మొదటి జట్టు విజేతగా అఫ్సర్ టీం గెలుపొందగా ద్వితీయ స్థానంలో సుమన్ జట్టు గెలుపొందింది. గెలుపొందిన జట్లకు నగదు బహుమతితో పాటు షీల్డులను అందించారు. దీంతోపాటు మొదటి విజేతకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు 7777 రూపాయల నగదును అందించగా, ద్వితీయ స్థానం జట్టుకు బీఆర్ఎస్ నాయకుడు అబ్దుల్ మజీద్ కురుషి 4444 రూపాయలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని గుండంలో నడిచిన భక్తులు


ఎల్లారెడ్డిలో అగ్ని గుండంలో నడుస్తున్న భక్తులు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయం వద్ద పూజారులు సంగప్ప ఆధ్వర్యంలో అగ్ని గుండం ఏర్పాటు చేశారు. భక్తులు అగ్ని గుండంలో నడిచి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అగ్ని గుండాల ప్రదర్శన

రామారెడ్డి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామం అడివి ప్రాంతంలో వెలిసిన స్వయంభు శ్రీ ముగ్గురం లింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం అంగరంగ వైభవంగా అగ్ని గుండాల ప్రదర్శన నిర్వహించారు. ఆలయ సీనియర్ పురోహితులు జంగం ప్రభు స్వామి నేతృతంలో పలు మంత్రాన్ని చదివిన అనంతరం అగ్నిగుండాల ప్రదర్శన నిర్వహించారు. ఆలయ పురోహితులు గణేష్ స్వామి, బాలు స్వామి, కుమార్ స్వామి, ప్రసాద్ స్వామి, తదితరులతో పాటు ఆలయ కమిటీ చైర్మెన్ లచ్చిరెడ్డి అగ్నిగుండాలపై వెళ్లారు. ఎవరికి ఎలాంటి ఔకదగలు జరగకుండా మంత్రాలు చదివి అనంతరం అగ్నిగుండల ప్రదర్శన అంగరంగ వైభవంగా నిర్వహించారు. కామారెడ్డి జిల్లాలోని వివిధ మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాం రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేందర్, వీడీసీ కమిటీ చైర్మెన్, ప్రతినిధులు, ఆలయ కమిటీ ధర్మకర్తలు, రాజకీయ పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సాలూరలో హోరాహోరీగా కుస్తీ పోటీలు


సాలూరలో కుస్తీపోటీల దృశ్యం



జన్నేపల్లిలో ..


రాణాకలాన్ శివాలయం వద్ద

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలో గురువారం మహ శివరాత్రి పండుగను పురస్కరించుకుని రెండవ రోజు నిర్వహించిన కుస్తీపోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ప్రతి సంవత్సరం మహ శివరాత్రి పండుగను పురస్కరించుకుని రెండవ రోజు కుస్తీపోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు. గురువారం నిర్వహించిన కుస్తీపోటీలలో మల్లయోధులు చుట్టు గ్రామాల నుండే కాక మహరాష్ట్ర, కర్ణాటక నుండి తరలివచ్చారు. మల్లయోధులు మధ్య కుస్తీపోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామంలోని సోమేశ్వర మందిరంలో భజనతో పాటు అగ్నిగుండాన్ని ఆనవాయితీగా ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

జన్నేపల్లిలో..

నవీపేట: మండలంలోని జన్నేపల్లిలో గురువారం సాయంత్రం కుస్తీపోటీలు నిర్వహించారు. స్థానిక చారిత్రక శివాలయంలో బుధవారం మహ శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన కుస్తీపోటీలలో జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న మహరాష్ట్ర నుండి పెద్ద ఎత్తున మల్లయోధులు కుస్తీపోటీలలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ కుస్తీపోటీలు నిర్వహించారు.

రాణాకలాన్ శివాలయంలో..

ఎడపల్లి: మహా శివరాత్రి వేడుకలలో భాగంగా గురువారం ఎడపల్లి మండలంలోని రాణాకలాన్ గ్రామ శివారులో గల శివాలయ ఆవరణలో కుస్తీ పోటీలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మహాశివరాత్రి మరుసటి రోజున కుస్తీ పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, అదే ఆనవాయితీని కొనసాగిస్తూ ఈ సంవత్సరం కూడా కుస్తీ పోటీలను నిర్వహించడం జరిగిందని, కుస్తీ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందించడం జరిగిందన్నారు. ఈ కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నుండే కాకుండా, మహారాష్ట్ర రాష్ట్రం నుండి మల్ల యోధులు వచ్చి కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు.

బీర్కూర్‌లో మూడు ఇళ్లల్లో అగ్నిప్రమాదం



బీర్కూర్‌లో మంటలు ఆర్పుతున్న అగ్ని మాపక సిబ్బంది



వస్తువులను చూపుతున్న బాధితులు

బీర్కూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీవాడలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించి మూడు పెంకుటిళ్ళు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో రూ.ఆరులక్షల రూపాయల ఆస్తినష్టం వాటిల్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ గ్రామంలోని ఎస్సీవాడకు చెందిన పిడుగు శాంతవ్వ, గంగామణి, సాయవ్వలు బీర్కూర్ గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. అయితే గురువారం ఉదయాన్నే ఇంట్లో పూజాకార్యక్రమాలు పూర్తిచేసుకున్నారు. ఇండ్లకు తాళం వేసి తమ కాలనీలో బసవేశ్వరుడికి గుడిలో జరుగు తున్న సప్తాహ కార్య క్రమానికి హాజరయ్యారు. ఇంతలోనే వారి ఇళ్ళల్లో విద్యుదాఘాతం సంభవించి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇళ్ళల్లో మంటలు వ్యాపించాయి. మూడు ఇళ్ళల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, బీరువా, బట్టలు, వస్తువులు, వంట సామగ్రి, రూ.50 వేల నగదు, ధృవీకరణ పత్రాలు అన్ని దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఒక్కొక్క ఇంట్లో రెండు లక్షల చొప్పున మూడు ఇళ్ళల్లో మొత్తం ఆరులక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. కట్టుకున్న బట్టలు మినహా ఇళ్ళల్లో ఉన్న వస్తువులు అన్ని కాలిబూడిద కావడంతో బాధితులు కన్నీరు మున్నీరు అయ్యారు. ఇళ్ళల్లో మంటలు వ్యాపించడంతో కాలనీవాసులు అప్రమత్తమయ్యారు. అగ్నిప్రమాదం సంభవించినట్లు గుర్తించి అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు.

మహిళ అదృశ్యం

కామారెడ్డి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గ్రీన్‌సిటీ కాలనీలో నివాసముండే వనం సంగీత అనే మహిళ కనిపించకుండా పోయినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈనెల 25న ఆమె భర్త పాపయ్య బంధువులు చనిపోతే వెళ్లగా ఆమె ఒక్కతే ఇంటి వద్ద ఉన్నదన్నారు. తిరిగి రాత్రి 8 గంటలకు పాపయ్య ఇంటికి రాగా ఆమె కనిపించకుండా పోయిందని తెలిపారు. చుట్టుపక్కల వెతికినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో గురువారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

మండలాల్లో ప్రశాంతంగా పోలింగ్



ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



ఓటుహక్కు వినియోగించుకునేందుకు నిలబడిన ఓటర్లు



నిజాంసాగర్‌లో కార్యకర్తలతో మాజీ ఎంపీ బీబీ పాటిల్

తాడ్వాయి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం గ్రాడ్యుయేట్స్ ఓటర్లు 671 ఉండగా అందులో 555 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయులు మొత్తం ఓట్లు 44 రిజర్వుడు మూడు ఉండగా 41 పోట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారులు తెలిపారు. మండలంలో మొత్తం గ్రాడ్యుయేట్స్ 82.71 శాతం ఉపాధ్యాయులు 93.18 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పెద్దకొడప్‌గల్ : మండలంలో ఉపాధ్యాయ ఎంఎల్‌సీ ఎన్నికల కోసం 18 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా, 18 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 100 శాతం ఓటింగ్ జరిగింది. ఇక పట్టభద్రుల ఎంఎల్‌సీకి గాను 211 మంది పట్టభద్రులు ఓటుహక్కు కలిగి ఉండగా, ఇందులో 142 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోవడంతో ఓటింగ్ శాతం 67.30 శాతంగా నమోదు అయింది. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాన్స్‌వాడ రూరల్ సీఐ రాజేష్, పెద్దకొడప్‌గల్ ఎస్‌ఐ మహేందర్ బందోబస్తు పర్యవేక్షించారు. తహసీల్దార్ దశరథ్ పోలింగ్ కేంద్రంలో నుంచి ఎన్నికల సరళిని పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాలను బాన్స్‌వాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు.

నాగిరెడ్డిపేట : మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో గురువారం నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 82.8 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శ్రీహిత్ తెలిపారు. మండలంలో 350 మంది పట్టభద్రులు ఓటర్లు ఉండగా అందులో 290 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో పట్టభద్రులైన 228 మం ది పురుషులు, 62 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. అలాగే మండల కేంద్రంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో 95 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శ్రీహిత్ తెలిపారు. మండలంలో 21 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా అందులో 20 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. అందులో 15 మంది పురుషులు, ఐదుగురు మహిళలు తమ ఓటు హక్కును వినియోగించు కున్న ట్లు అధికారి తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు.

పిట్లం : కరీంనగర్, నిజమాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాన్ని బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి మెడికల్ కిట్లను పరిశీలించి, ఓటరు శాతం వివరాలు అధికా రులకు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అల్లర్లు జరుగకుండా ముందు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పిట్లం గ్రామానికి చెందిన చంచల్‌గూడ జైల్‌శాఖ సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు.

మద్నూర్ : ఎలాంటి అవాంఛనీయ సం ఘటలు జరగకుండా ఎస్సై విజయకొండ పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాలను బాన్సువాడ సబ్ కలెక్టర్ పరిశీలించారు. పట్టభద్రులు 417 మంది ఉండగా వారిలో 314 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపా ధ్యాయులు 49 మంది ఉండగా 46 మంది ఉపాధ్యా యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.డోంగ్లి మండలంలో పట్టభద్రులు 107 మంది ఉండగా 81 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు 11 మంది ఉండగా 10 మంది తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు స్థానిక తహసీల్దార్ , ఎంపీడీవోలు వెల్లడించారు.

లింగంపేట : మండలంలోని మొత్తం పట్టభద్రులు 765 మందికి గాను 638 మంది, 31 మంది ఉపాధ్యాయలకు గాను 30 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ వచ్చి ఎన్నికల సరళిని తెలుసుకున్నారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, కామారెడ్డి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంపత్‌గౌడ్ సతీసమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లను ఎస్‌ఐ లావణ్య పర్యవేక్షించారు.

బాన్సువాడటౌన్ : బాన్సువాడ పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. బాలికల ఉన్నత పాఠశాలలో టీచర్స్ , పట్టభద్రుల కోసం ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా టీచర్స్ ఓటర్లు మొత్తం 186 ఉండగా అందులో 178 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 95.70 పోలింగ్ శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా 1112 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా అందులో 930 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 83.63 పోలింగ్ శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

బీర్కూర్: 87 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. మండలంలో 348 పట్టభద్రులు ఉండగా 298 మంది తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు. 37 మంది ఉపాధ్యాయులు ఉండగా నూటికి నూరు శాతం తమ ఓటు హక్కును విని యోగించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు, పోలీసులు పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రం లో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

నిజాంసాగర్: మండలంలో టీచర్లు తొమ్మిది మంది, పట్టభద్రులు 106 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహ్మద్‌నగర్‌లో 14 మంది టీచర్లకు 14 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రులు ఒక వంద డెబ్బై మందికి గాను 119 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహ్మద్‌నగర్ పోలింగ్ కేంద్రాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. నిజాంసాగర్ పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళి బీజేపీ నాయకులు మాజీ ఎంపీ బీబీ పాటిల్ పరిశీలించారు.

రామారెడ్డి : ఎమ్మెల్సీ ఓట్లు వేసేందుకు మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రం వద్ద పట్టభద్రులు, టీచర్లు ఒకేలైన్‌పై నిలబడి తీవ్ర అవస్థలు పడ్డారు. పట్టభద్రుడు 472 ప్రభుత్వ టీచరు 36 మంది ఉండగా, ప్రభుత్వ టీచర్లు పూర్తిస్థాయిలో కాగా పట్టబద్రుడు 472 మంది ఉండగా 397 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో 84.11 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జుక్కల్ : మండల కేంద్రంలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల ఓట్లు 347 ఉండగా 231 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయుల ఓట్లు 17 ఉండగా 14 మంది ఓటు హక్కును వినియో గించుకున్నారు. పోలింగ్ శాతం 66.5 శాతం నమో దైందని తహసీల్దార్ తెలిపారు. జుక్కల్ ఎస్‌ఐ భువనేశ్వర్ బందోబస్తు నిర్వహించారు.

బీబీపేట : పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఆలయాల్లో ఘనంగా పూజలు



మద్నూర్‌లో పూజల అనంతరం కార్యకర్తలతో ఎమ్మెల్యే



భిక్కనూర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పెద్దకొడప్‌గల్ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దుర్కిలో మహా అన్నదానంలో పాల్గొన్న పోచారం కుటుంబ సభ్యులు

మద్నూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అతి పురాతన కాలం నాటి సోమలింగేశ్వర ఆలయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు గురువారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాధాన్యత గురించి కార్యకర్తలకు అడిగి తెలుసుకున్నారు. ఆలయంలో సొరంగ మార్గం ఉన్నట్లు తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

పెద్దకొడప్‌గల్: మండలంలోని కాటేపల్లిలో గల శివాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం నుంచి భజన, కీర్తనలు చేస్తు ఆలయానికి చేరుకు న్నారు. ఆలయం వద్ద స్వామికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో మల్లప్ప పటేల్, విజయ్‌దేశాయ్ పాల్గొన్నారు.

లింగంపేట : మండలంలోని పలు గ్రామాల్లో గల శివాలయాల్లో శివరాత్రి సందర్భంగా గురువారం ఉపవాస దీక్షను విరమించిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని కోర్పోల్, మెంగారం, శెట్పల్లి, అయ్యపల్లి, బోనాల్ గ్రామాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆలయాల్లో భక్తులు స్వామివారికి అభిషేకాలు చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

బీర్కూర్ : మండలంలోని ప్రధాన ఆలయాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీర్కూర్‌లోని జోడులింగేశ్వర ఆలయం, నగేశ్వర ఆలయం, బసవన్న ఆలయం, కామప్ప ఆలయాలతో పాటు బరంగేడ్గిలోని పరమేశ్వర ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద సంఖ్యలో పాల్గొన్నారు.

భిక్కనూరు : మండలంలోని కాచాపూర్ గ్రామంలోని వీరేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాల్లో బాగంగా స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అన్నపూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాం గణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలకేంద్రంలో దక్షిణకా శీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భావ పూజ ఆలయ అర్చకులు వేదమంతోచ్ఛరణల నడుమ ఘనంగా నిర్వహించారు. మండలంలోని తిప్పాపూర్ గ్రామ అటవీప్రాంతంలో కొలువుదీరిన శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయ ఉత్సవాలను యాదవ సంఘం ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ముత్యాల పందిరిలో శ్రీ మల్లిఖార్జున స్వామి, గొల్ల కేతమ్మ,మేడాలమ్మ కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

నసురుల్లాబాద్ : బాన్సువాడ నియోజకవర్గంలోని కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల పరిధిలోని దుర్కి గ్రామ శివారులో గల శ్రీ సోమలింగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఆలయం వద్ద గురువారం ఆలయ ధర్మకర్త పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి అతని కుమారులు పోచారం సురేందర్ రెడ్డి, ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులకు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి యేడు మాదిరిగా మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా, తో పాటు జిల్లాలోని ఆయా మండలాల, ఇతర జిల్లాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో. ఉమ్మడి మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల - శ్రీనివాస్, దుర్గం మహేష్, ఏడే మోహన్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, శివభక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

దోమకొండ:మండల కేంద్రంలోని శివరాం మందిర్ ఆలయం ఆవరణలలో గురువారం చక్కెరతీర్థం కొనసాగింది. మాచారెడ్డి, బీబీపేట, బిక్కనూర్, దోమకొండ మండలాలతో పాలు వివిధ మండలాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని వసతులు ఏర్పాటు చేశారు. శివరాంమందిర్ ఆలయంలో ఉదయం నుంచే పూజలు నిర్వహించి నాకబలి,అవబృద స్నానము, పూర్ణహరాతి, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొండ అంజయ్య, కార్యనిర్వహణాధికారి ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్ : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న సాయిబాబా ఆలయంలో బుధవారం రాత్రి 10 గంటల తర్వాత శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. దాదాపు 150 మంది దంపతులు ఈ కల్యాణంలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం 12 గంటల తర్వాత లింగోద్భవం, అభిషేకం చేశారు. గురువారం ఉపవాస దీక్ష అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో గుడి నిర్వహకులు కుంబాలరవియాదవ్, మనోహన్‌కైలాస్ సంతోష్, శ్రీనివాస్, గజవాడ రవికుమార్, జూలురి వాసరయ్య, రవీందర్,సత్యం, శ్రీధర్, చక్రధర్, గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పురోహి తులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్ఛరణలతో గర్భగుడిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సింధూర పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బుర్ర ప్రభురామచంద్రం గుప్తా నేతృ త్వంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో రామారెడ్డి పలు రాజకీయ నాయకులు, వ్యాపారులు, వైద్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆలయ సిబ్బంది నాగరాజు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో శివపార్వతుల కల్యాణం సందర్భంగా గురువారం హనుమాన్ ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయకమిటీ అధ్యక్షుడు భూమాగౌడ్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఉపవాసం చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేపడుతామని తెలిపారు.



భిక్కనూరులో క్యూ కట్టిన భక్తులు



బీర్కూర్‌లో మల్లన్న ఆలయ సన్నిధిలో అన్నదానం



మెంగారం శివాలయంలో అన్నదానం చేస్తున్న భక్తులు



శ్రీ కాలభైరవ స్వామి



శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో అలంకరించిన స్వామివారు



ట్రాక్టర్లను తిప్పుతున్న భక్తులు

ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ప్రదక్షిణలు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని తాండూర్ గ్రామంలో గల త్రీలింగ రామేశ్వరాలయం వద్ద జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు గురువారం సాయంత్రం భక్తులు ఎడ్లబండ్లను, ట్రాక్టర్లను ఆలయం చుట్టూ తిప్పారు. తమ మొక్కులను తీర్చుకున్నారు. గ్రామాలలో ఎడ్లబండ్లు కనుమరుగవుతున్నందున కొందరు భక్తులు ట్రాక్టర్లను ఆలయం చుట్టూ తిప్పి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ బండ్లు తిరిగే కార్యక్రమాన్ని తిలకించడానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులువందలాదిగా ఆలయానికి తరలివచ్చి కార్యక్రమాన్ని తిలకించారు. ఎడ్ల బండ్లు తిరిగే కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై మల్లారెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తు, ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - చావా

ప్రియా 70 - రిటర్న్ ఆఫ్ దా డ్రాగన్

ప్రియా 35 - తండేల్

బాన్సువాడ

మహేశ్వరి - లైలా

వెంకటేశ్వర - చావా

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

